కబ్జాలోనే మున్సిపాలిటీ స్థలం!

ఆరేళ్లుగా స్థలం విషయాన్ని పట్టించుకోని అధికారులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఆ మునిసిపల్ స్థలానికి ఎన్ని వింతలు జరిగాయో? తెలీదు గానీ మొత్తానికి ఆ స్థలం కబ్జాకు గురైందనే విషయాన్ని నాడు మునిసిపల్ ఉన్నతాధికారులు ఆలస్యంగా గుర్తించారు. ఆ స్థలం సుమారు 200 గజాలు వరకూ ఉంటుంది. దీని విలువ సుమారు రూ.60 లక్షల వరకూ ఉంటుంది. ఈ స్థలంపై ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా స్పందించని అధికారులు నాడు సాక్షి పత్రికలో కథనం రావడంతో వెంటనే స్పందించి ఆ స్థలంపై తగిన చర్యలు తీసుకున్నారు. కానీ నేటికి ఆ స్థలాన్ని మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

దర్జాగా రిజిస్ట్రేషన్

పట్టణంలోని 28వ వార్డు గూడ్సు షెడ్‌కు వెళ్లే రహదారి శ్రీకృష్ణా నగర్‌లో మునిసిపల్ మరుగుదొడ్డి ఉంది. ఆ మరుగుదొడ్డి స్థలం సుమారు 200 గజాల వరకూ ఉంటుందని అంచనా. ఈ స్థలం మరుగుదొడ్డిగా ఉండగానే 2013లో ఓ మునిసిపల్ ఉద్యోగి రిజిస్ట్రేషన్ చేయించుకుని 2014లో పన్ను కూడా వేయించుకున్నాడు. ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఆ ఉద్యోగి చాలా పకడ్బందీగా ప్లాన్ వేశారు. ఆ ఉద్యోగికి మరుగుదొడ్డి స్థలంకు పక్కనే సొంత స్థలం ఉంది. ఆ స్థలంలో నూతన భవనం నిర్మించుకోవడానికి 2013లో ప్లాన్‌కు అప్లై చేసుకున్నాడు. ప్లాన్ ఇచ్చే సమయంలో ఉత్తరం వైపున మునిసిపల్ పబ్లిక్ టాయిలెట్స్ అని రాయకుండా ఖాళీ స్థలం అని రాశారు. దాంతో అప్పట్లో ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. రిజిస్ట్రేషన్ నెం–4855 డాక్యుమెంట్‌తో 2014లో రూ.2,356లు పన్ను కూడా వేయించుకున్నాడు. నాటి పన్ను రశీదు 1079026036తో మునిసిపల్ మరుగుదొడ్డి స్థలం అతని సొంతంగా ఫీల్ అయ్యాడు. అనంతరం వార్డులో కొందరు నాయకులను పట్టుకుని మునిసిపల్ కార్యాలయంలో తనకున్న పరిచయాలతో ఆ మరుగుదొడ్డిని తొలగించడానికి దాదాపుగా నాలుగేళ్లు శ్రమించాడు. మొత్తానికి 2018లో మరుగుదొడ్లు తొలగించి సగం స్థలంలో ఓ గోడ నిర్మించి మిగిలిన స్థలాన్ని అలా వదిలేసి తన స్వాధీనంలోనే ఉంచుకున్నాడు. ఆ స్థలాన్ని ఎవ్వరూ కబ్జా చేయకుండా ఎవరికీ అనుమానం రాకుండా మునిసిపల్ అధికారులు వేస్తున్నట్లు ట్రీ గార్డులతో మొక్కలను నాటించాడు. ఇక్కడ విచిత్రం ఏంటంటే మునిసిపల్ మరుగుదొడ్లు 2018లో తొలగించారు. కానీ మునిసిపల్ అధికారులు మరుగుదొడ్లు ఉండగానే 2014లో ఆ ఉద్యోగి సంబంధించిన వారి పేరున పన్ను వేయడం గమనార్హం.


మునిసిపల్ ఉద్యోగి స్వాధీనంలో ఉన్న మునిసిపల్ మరుగుదొడ్డి స్థలం (ఫైల్)


ఐరన్ రేకులతో ఫెన్సింగ్ వేసి ఉన్న మునిసిపల్ మరుగుదొడ్డి స్థలం

సాక్షి కథనంతో రిజిస్ట్రేషన్ రద్దు

ఈ రిజిస్ట్రేషన్ గొడవ నాడు పత్రికలో వచ్చి పట్టణంలో ప్రచారం కావడంతో 159–3 సర్వే నెంబరుతో డాక్యుమెంట్ నెం 4855–2013లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆ ఉద్యోగి రిజిస్ట్రేషన్ నెం 273–2018న రద్దు చేసుకున్నాడు. మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించి ఆ మునిసిపల్ మరుగుదొడ్ల స్థలంలో ఫెన్సింగ్ లేదా ప్రహరీ నిర్మించాలి. కానీ నేటికి మునిసిపల్ అధికారులు ఆ స్థలంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నేడు ఆ స్థలం మళ్లీ కబ్జాకు గురైందా? లేక ఆ మునిసిపల్ ఉద్యోగి స్వాధీనంలోనే ఉందా? లేక మునిసిపల్ అధికారుల స్వాధీనంలో ఉందా? అనేది అర్థం కావడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి రూ.లక్షలు విలువ చేస్తే స్థలాన్ని స్వాధీనం చేసుకుని, మున్సిపాలిటీ ఆస్తిని కాపాడాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మునిసిపల్ మరుగుదొడ్డి స్థలం ఆక్రమణపై గతంలో ఆరోపణలు వచ్చినప్పుడు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ స్థలం అలానే ఉంది. మళ్లీ ఆ స్థలానికి రేకులతో ప్రహరీ తీసి ఆక్రమణ చేసినట్లు చెపుతున్నారు. స్థల పరిశీలన చేసి ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించే చర్యలు తీసుకుంటాం. – వీరబ్రహ్మం, పట్టణ ప్రణాళికా విభాగం అధికారి, పాలకొల్లు

క్లుప్తంగా

విద్యుత్ బిల్లుల పెంపుతో ప్రజలపై భారం


దేవ రాజేష్‌కుమార్

పాలకొల్లు అర్బన్: ప్రజలపై ఎలాంటి పన్నుల భారం మోపమని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు భరోసా హామీని చంద్రబాబు తుంగలోకి తొక్కి కనీసం పంటల బీమా ప్రీమియం కూడా రైతులపైనే భారం మోపారని ఆయన విమర్శించారు. నాలుగు నెలల పాలనలో చంద్రబాబు రాష్ట్ర ప్రజల ఆశలను ఒమ్ము చేశారని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లులు భారం మోపి ప్రజల నెత్తిన టోపి పెట్టారని మండిపడ్డారు. కేవలం కక్ష సాధింపు రాజకీయాలతో, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని రాజేష్ కుమార్ విమర్శించారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని కాపుల కొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేశారు.

ఫెర్రీ బకాయి చెల్లింపునకు అంగీకారం

నరసాపురం రూరల్: గత ఆర్థిక సంవత్సరం మాధవాయిపాలెం ఫెర్రీ పాటదారుడు బకాయి పడిన సొమ్మును మూడు వాయిదాల్లో చెల్లించేందుకు పాటదారుడు అంగీకరించారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జెడ్పీసీ సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న సభ్యులు బకాయి మొత్తం చెల్లించాలని పాటదారుడిని ఆదేశించారు. దీంతో పాటదారుడు ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మూడు వాయిదాల్లో బకాయి సొమ్ము చెల్లించే విధంగా పోస్ట్ పెయిడ్ చెక్కులను మండలపరిషత్ అధికారులకు అందజేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ మైలాబత్తుల సోనీ, ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, నరసాపురం, సఖినేటిపల్లి మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యాప్రవేశ్ ప్రోగ్రామ్ ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్

పాలకొల్లు సెంట్రల్: విద్యాప్రవేశ్ 90 రోజుల ప్రోగ్రాంను జిల్లా సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి శ్యాంసుందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం స్థానిక జీవీఎస్‌వీఆర్ ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో పర్యటించి విద్యాప్రవేశ్ కృత్యాలను పరిశీలించారు. అనంతరం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ద్వారా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించిన తర్వాత విద్యార్థులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, ఇన్‌చార్జ్ ఏఎంఓ చంద్రశేఖర్, జిల్లా ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

భీమవరం: కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ భీమవరం పట్టణం 28వ వార్డుకు చెందిన గోళ్ల షారూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ శనివారం చెప్పారు. వివరాల ప్రకారం గోళ్ల షారూన్‌కు 2017 అక్టోబర్ 11న కాళ్ల మండలం బొండాలపేటకు చెందిన గోళ్ల కేదారేశ్వరరావుతో వివాహమైంది. వివాహం అనంతరం భర్త, అత్తమామల కోరిక మేరకు రూ.10 లక్షలు కట్నంగా ఇచ్చారు. తరువాత వ్యవసాయ పెట్టుబడికి సొమ్ములు కావాలంటూ అదనపు కట్నం తేవాలంటూ డిమాండ్ చేయడంతో 16 కాసుల బంగారం అమ్మి సొమ్ములు ఇచ్చారు. తరువాత మరొక రూ. 10 లక్షల తేవాలంటూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని షారూన్ ఈ నెల 25న పోలీసులను ఆశ్రయించింది.

వ్యక్తి అరెస్ట్

భీమవరం: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రైల్వే ఎస్సై పీటీవీ రమణ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉడిమూడి గ్రామానికి చెందిన ఇసుకపట్ల ప్రసన్న బాబు రైళ్లలో ప్రయాణిస్తూ మహిళల హ్యాండ్ బ్యాగ్‌లో విలువైన వస్తువులను చోరీ చేస్తుండగా అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 3 కాసుల బంగారు పూసల దండ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.51 వేలు ఉంటుందన్నారు.

అన్న ప్రేమను ఒమ్ము చేసిన షర్మిల

పాలకొల్లు అర్బన్: అన్న ప్రేమను చెల్లెలు షర్మిల ఒమ్ము చేసిందని జడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన చెల్లెలపై ప్రేమతో తన ఆస్తిలో వాటాకు సంబంధించిన ఎంఓయూ చేశారని, అయితే ఆ షేర్లను జగన్‌కి చెప్పకుండా బదలాయించి షర్మిల తప్పు చేసిందని ఆయన దుయ్యబట్టారు. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా జగన్ కేసు వేయడంలో తప్పులేదని ఆయన సమర్థించారు.

షర్మిల లేఖ టీడీపీ వెబ్‌సైట్‌లో ఎలా వచ్చింది?

పాలకొల్లు అర్బన్: కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన అన్నకు వ్యక్తిగతంగా రాసిన లేఖ కూటమి వెబ్‌సైట్‌లో ముందుగా ఎందుకు విడుదల చేశారు? అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి విన్‌స్టన్‌బాబు ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్డీఏలో కొనసాగుతూ కాంగ్రెస్ నాయకులతో స్నేహాన్ని కొనసాగించడం చంద్రబాబుకి సిగ్గులేదని విమర్శించారు. కుటుంబ తగాదాలపై టీడీపీ ఆసక్తి ఎందుకు? అని ఆయన నిలదీశారు. షర్మిల జగన్‌కి రాసిన లేఖని తెలుగు దేశం పార్టీ అఫిషియల్ ఎక్స్ హాండిల్‌లో బిగ్ బ్లాస్ట్ అంటూ పోస్టు చేయడం వీరి మధ్య గొడవని రెచ్చగొట్టే విధంగా చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూటు మారిన పల్లె బస్సులు


మార్టేరు-పాలకొల్లు రహదారిలో బారికేడ్లు పెట్టిన దృశ్యం


రాకపోకలు నిలిపివేసిన పెనుగొండ-పెరవలి రహదారి

పెనుగొండ: రహదారి మరమ్మతుల పుణ్యమా అని ఆర్టీసీ బస్సులు పల్లెలను చుట్టి వస్తున్నాయి పూర్తి అధ్వానంగా మారిన రహదారుల విస్తరణకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడం పనులు ప్రారంభం కాలేదు. ఆ నిర్మాణ పనులను అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల ప్రారంభించారు. దీనిలో భాగంగా మార్టేరు పాలకొల్లు రహదారిలో మార్టేరు నుంచి 700 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభించారు.దీంతో పాటు ఇరగవరం మండలం ఐతంపూడిలోనే కనీసం రాకపోకలకు సైతం పనికిరాని విధంగా రహదారి పాడైపోవడంతో కిలో మీటరు మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ మరమ్మతుల వల్ల మార్టేరు నుంచి పాలకొల్లు వెళ్లే రహదారిలోని వాహనాలను దారి మళ్లించారు. అదేవిధంగా పెనుగొండ నుంచి పెరవలి వైపు వెళ్లేవాహనాలను దారి మళ్లించారు. దీంతో ఎన్నో ఏళ్ల తరువాత పల్లెలు ఆర్టీసీ బస్సు రాకపోకలతో కళకళలాడుతున్నాయి. నరసాపురం నుంచి రాజమండి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు సైతం పాలకొల్లు, లంకలకోడేరు, కాపవరం, నెలమూరు బ్రిడ్జి, ఆలమూరు, మార్టేరు మీదుగా పెనుగొండకు నుంచి వెళుతున్నాయి. అదేవిధంగా నిడదవోలు వేళ్లే బస్సులు ఇదే దారిలో పెనుగొండ వరకూ వచ్చి వడలి, వేమవరం, మరికొన్ని సిద్ధాంతం మీదుగగా వెలుతున్నాయి. భారీ వాహనాలు సైతం పెనుగొండ నుంచి తణుకు వైపు వెళ్లడానికి కంతేరు, ఇరగవరం గ్రామాల మీదుగగా వెళ్తున్నాయి. అయితే మరో నెలరోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

తప్పని ఇబ్బందులు

ఇదిలా ఉండగా, పెనుగొండ విద్యా సంస్థల్లోనూ, తణుకు, పాలకొల్లు విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులు రాకపోకలకు నానావస్థలు పడుతున్నారు చుట్టూ తిరిగి ఆయా ప్రాంతాలకు చేరుకోవాల్సి వస్తుండడంతో అవస్థలు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సూచనలు పాటించాలి

పెనుగొండ: ఉపాధ్యాయుల బదిలీల చట్టం, కర్ణాటక, కేరళలో ఉన్న మాదిరిగా చట్టాలను రాష్ట్రంలో చేసేటప్పుడు ఉపాధ్యాయుల సూచనలుకు అధిక ప్రాధాన్యత నివ్వాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయి వర్మ అన్నారు. శనివారం సిద్ధాంతం, ఇలపర్రుల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వం ప్రారంభించి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఉపాధ్యాయుల పదోన్నతలపై ప్రత్యేక చట్టం చేసి ఉపాధ్యాయులకు ఎప్పటికపుడు ప్రమోషన్లు ఇవ్వాలని, పని సర్దుబాటు హేతుబద్ధీకరణ పేర్లు చెప్పి ఎస్ఏల స్థానంలో, ఎస్జీటీలను హైస్కూలుల్లో పని చేయిస్తున్నారన్నారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు అన్ని పరిష్కరించాలని, పీఆర్‌సీ అమలు చేసి, ఫిట్‌నెస్ 30 శాతం ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా మాజీ ఛైర్మన్ భూపతిరాజు జవహర్ లాల్ రాజుకోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తూటి రాజారావు, జిల్లా అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, మండల అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాస్ జి.శ్రీరాములు పాల్గొన్నారు.


సిద్ధాంతంలో ఎస్టీయూ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గురు శిష్యులకు ప్రపంచ రికార్డుల్లో గుర్తింపు

పాలకొల్లు సెంట్రల్: శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన ప్రపంచ కవితోత్సవంలో పోడూరు మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కొల్లా బత్తుల సూర్యకుమార్ తన ఇద్దరు శిష్యులతో కలిసి తమ ప్రతిభను కనబరిచడంతో నాలుగు ప్రపంచ రికార్డులలో తమ పేర్లను నమోదైనట్లు తెలిపారు. శనివారం సూర్యకుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19,20 తేదీల్లో జిల్లాలో తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ కవితోత్సవంలో 24 గంటల 24 నిమిషాల 24 సెకండ్ల పాటు నాన్‌స్టాప్ ప్రపంచ సాహితి కళాజాతరలో తెలుగుభాష ఔన్నత్యంపై కవితను ఆలపించినట్లు తెలిపారు. అలాగే విద్యార్థినులు రాపాక అమృతవర్షిణి, గుడాల టబు శ్రీలక్ష్మి దేశభక్తి గీతానికి నృత్య ప్రదర్శన చేసి ప్రపంచ రికార్డు సాధించారన్నారు. అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్, టిఎస్ఏ బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో గుర్తింపు పొందామన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి జి విజయ కుమార్, జీవీ సూర్యనారాయణ, కాంప్లెక్స్ ఛైర్మన్ కె.బేబి విజయలక్ష్మి, సీఆర్‌పీ మైలే శాంతకుమారి, హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, సర్పంచ్ వడ్డపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు అభినందనలు తెలియజేశారు.


అవార్డులతో ఉపాధ్యాయులు సూర్యకుమార్ విద్యార్థినులు టబు, అమృత

పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్స్ అందజేత

పాలకొల్లు సెంట్రల్: పారిశుద్ధ్య కార్మికులు చేసే పనికి సంబంధించిన సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ బి.పార్థసారధి అన్నారు. శనివారం ది నేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ శానిటేషన్ ఏకోసిస్టమ్ (నమస్తే) కార్యక్రమంలో భాగంగా సఫాయి కర్మచారి (సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్) కార్మికులకు ప్రత్యేకంగా పీపీఈ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పార్థసారధి మాట్లాడుతూ సఫాయి కర్మచారి కార్మికులు ఆరోగ్యంగా ఉండాలంటే పీపీఈ కిట్స్ ధరించి విధుల్లో పాల్గొనాలని కోరారు. సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసిన అనంతరం వాహనాల్లో వాటిని తరలించి ఎక్కడబడితే అక్కడ వదలితే మీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నరసాపురంలో ఉన్న ఎఫ్ఎస్‌టీపీ శుద్ధి చేసే ప్లాంట్ వద్ద వ్యర్థాలను వదలాలని అన్నారు. మొత్తం 13 మందికి పీపీఈ కిట్స్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, సచివాలయ శానిటరీ సిబ్బంది హరికృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


పీపీఈ కిట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ పార్థసారధి

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 195 మంది ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 195 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. శనివారం జరిగిన ఈ జాబ్‌మేళాలో 18 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొన్నాయన్నారు. మొత్తం 305 మంది విద్యార్థులు పాల్గొనగా 195 మంది ఎంపికయ్యారన్నారు. వీరిలో హెట్రోమోటర్స్ 51, డైకిన్ 30, అపోలో ఫార్మసి 14, నవత ట్రాన్స్‌పోర్ట్ 5, ఇండోఎంఎం 13, పానసోనిక్ 11, హ్యూందాయ్ 2, ఫాక్స్‌కాన్, ప్రీమియర్ అంజనీ ఫౌండేషన్స్ 45 మందిని ఎంపికయ్యారని వివరించారు. వీరిలో 104 మంది విద్యార్థులు తమ కళాశాలకు చెందిన పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీ రంగారావు, కారుమూరి రామలింగేశ్వరరావు, టి.కృష్ణ, కె.భద్రాచలం, ఎం.శిరీష తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

నానాజీ కుటుంబానికి ముద్రగడ పరామర్శ

పెనుగొండ: డీసీసీబీ మాజీ డైరెక్టరు, పెనుగొండ సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి లక్ష్మయ్య నాయుడు(నానాజీ) మృతి తీరని లోటు అని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. శనివారం పెనుగొండలో మాజీ శాసన సభ్యుడు కూనపరెడ్డి వీర రాఘవేంద్రరరావు(చినబాబు) కుటుంబాన్ని పరామర్శించి, నానాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చినిమిల్లి రాయుడు, ప్రముఖ అడ్వకేట్లు ఇందుగమిల్లి రామానుజం, టీవీ గోవిందు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, విద్యామౌలిక వసతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టరు కొవ్వూరి వేణుమాధవరెడ్డి, రామన్నపాలెం సర్పంచ్ యర్రంశెట్టి బుజ్జి, విశ్రాంత ఆచార్య డాక్టర్ ఆర్.రామ్మోహనరావు, రైసుమిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి గాజుల బులిపుల్లారావు తదితరులు పాల్గొన్నారు.


నానాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మద్దూరి సూరిబాబు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. శనివారం ఆలయంలో ముందుగా స్వామి వారికి వేద మంత్రాలతో ప్రదక్షిణ చేసి అనంతరం మహన్యాసం, రుద్రాభిషేకం, లక్ష కుంకుమార్చన, లక్షపత్రి, రుద్రహోమం, కల్యాణం, పాశుపత పారాయణం, తులసి పూజ, గణపతి పూజ, గరికపూజ, ఏకావహం, ఏకరుద్రాభిషేకం, శ్రీ చక్రార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ప్రారంభించిన ఈ పూజా కార్యక్రమాలు సాయంత్రం వరకూ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో పురోహితులు భమిడపాటి వెంకన్న, నేదునూరి శ్రీనివాసు, తనికెళ్ల శ్రీనివాసు, ఈమన శ్రీనివాసు, ఫణి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

నేడు కొప్పర్రుల్లో అన్నసమారాధన

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, వినాయక స్వామివార్ల విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు సవరం సత్యనారాయణ, ధర్మరాజు దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిష్ఠామహోత్సవాల్లో ఆఖరి రోజు ఆదివారం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహిస్తామని ఆహ్వాన కమిటీ తెలిపారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అగ్ని మదనం, అగ్ని ప్రతిష్ఠ, అష్ట కళశారాధన, పాయసాన్న వితరణ, తదితర పూజలు హోమాలు నిర్వహించి, గ్రామోత్సవం చేశారు.

29న కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29వతేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిలప్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

వివాదానికి దారి తీసిన ఈఓ నిర్ణయం

నరసాపురం: పట్టణంలోని శ్రీకపిలమల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కె.రామచంద్రరావు తీసుకున్న నిర్ణయం వివాదానికి దారితీసింది. ఈ ఏడాది కార్తీకమాసంలో దర్శనానికి వచ్చే భక్తులకు టికెట్ పెట్టాలని ఈఓ ప్రతిపాదించారు. అయితే ఈ విషయం తెలుసుకున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు శనివారం ఈఓతో వాగ్వివాదానికి దిగారు. ఎప్పుడూలేనిది ఇలాంటి నిర్ణయాలతో భక్తులపై భారం వేయడం ఏంటి? అని ప్రశ్నించారు. వారి ఆందోళనతో ఈఓ ప్రతిపాదన ఉపసంహరించుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

ఏపీబీ, ఏటీబీ ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం: నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ఏపీబీ, ఏటీబీ ఏజెంట్ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరసాపురం–భీమవరం వయా మత్స్యపురి రూట్, వయా దిగమర్రు, పాలకొల్లు రూట్, నరసాపురం–రాజమండ్రి వయా కవిటం, సిద్ధాంతం రూట్, నరసాపురం–మచిలీపట్నం వయా మొగల్తూరు, ముత్యాలపల్లి రూట్, నరసాపురం–హైదరాబాద్ వయా అత్తిలి రూట్‌లో అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 99592–25488 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నేడు విజయవాడలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభ

పాలకొల్లు అర్బన్: భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రతినిధుల సభ ఆదివారం విజయవాడలో నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు గంటా నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్యదర్శులు, మండలాల కార్యవర్గ సభ్యులు, కార్యదర్శులు తరలిరావాలని ఆయన కోరారు. ఆదివారం ఉదయం భగ్గేశ్వరం నుంచి బస్సులో రాష్ట్ర ప్రతినిధుల సభకు తరలివెళుతున్నట్లు నాగరాజు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

4న మేడపాడులో లక్ష బిల్వార్చన

యలమంచిలి: కార్తికమాసం మొదటి సోమవారం (నవంబర్ 4న) మేడపాడు శివాలయంలో లక్ష బిల్వార్చన (లక్ష పత్రి పూజ) కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు బాదంపూడి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 97019 66551 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

పీడీఎఫ్ సభ్యుడిని గెలిపించాలి

పెనుగొండ: ఉపాధ్యాయులు అధ్యాపకులు, కార్మికుల వేతన జీవులు పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సీ అభ్యర్థి బొర్రా గోపి మూర్తికి ఉపాధ్యాయులంతా ప్రథమ ప్రాధాన్యత ఓటుతో అండగా నిలవాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేతా వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. శనివారం ఆచంట ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడేది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌పీఎన్ శర్మ, యూటీఎఫ్ ఆచంట మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ప్రజాసంఘాల నాయకులు వి.ఉషారాణి కేతా నాగాంజనేయులు, తోటపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నరసాపురం: 19 ఏళ్ల యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి చెప్పారు. వివరాల ప్రకారం ఏలూరుజిల్లా మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం గ్రామానికి చెందిన కుంచె నాగలక్ష్మి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ ఓ కళాశాలలో బీకాం చదువుతుంది. అయితే ఈ నెల 21న తల్లితండ్రులు కూతురిని చూసేందుకు నరసాపురం వచ్చి కళాశాలకు, హాస్టల్‌కు వెళ్లారు. కూతురు కనిపించకపోవంతో బంధువులను ఆరాతీశారు. ఆమె సెల్‌ఫోన్ కూడా స్విచాఫ్ చేసి ఉండడంతో పోలీసులను ఆశ్రయించారు.